సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 5 । ఆగస్టు । 2024



ఆకట్టుకున్న 'మణిదీపాలు'

ప్రశాంతి నిలయంలో తూర్పుగోదావరి జిల్లా భక్తులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. 8లో



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.7. సరాసరి రూ.14 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.8°/23.3°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

23 మంది తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి జిల్లాకు వచ్చిన 23 మంది తహసీల్దార్లకు స్థానాలు కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ చేతన్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్ ఏఓగా వెంకటనారాయణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లుగా సురేష్‌కుమార్, ఖతిజన్‌కుబ్రా, నాగరాజు, ధర్మవరం ఆర్డీ కార్యాయ ఏఓగా సుబ్బలక్ష్మమ్మను నియమించారు. రొద్దం తహసీల్దార్‌గా నాగేంద్ర, పుట్టపర్తికి అనుపమ, బుక్కపట్నంకు సయ్యద్ సహబుద్దీన్, కొత్తచెరువుకు నాగరాజు, నల్లమాడకు రంగనాయకులు, ఓడీ చెరువుకు అనంతాచారి, ధర్మవరానికి నటరాజ, రామగిరికి జమానుల్లాఖాన్, కదిరికి మురళీకృష్ణ, గాండ్లపెంటకు వేణుగోపాల్, పెనుకొండకు శ్రీధర్, పరిగికి హసీనా సుల్తాన, లేపాక్షికి సౌజన్యలక్ష్మి, చిలమత్తూరుకు ఆనందకుమార్, అగళికి శ్రీనివాసులు, రొళ్లకు జిలాని, అమరాపురానికి స్వర్ణలత, గుడిబండ తహసీల్దార్‌గా కరుణాకర్‌ను నియమించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



మడకశిర పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌డివిజన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి టౌన్ : ఎస్జీటీ, ఎస్ఏ పోస్టులకు సన్నద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన శాఖ అధికారి మోహన్‌రావ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్టీ అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఎడ్, టెట్ మెరిట్ ఆధారంగా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13లోపు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. దరఖాస్తులు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. ఈ ఆవకాశాన్ని గిరిజన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి శ్రావణ శని వారోత్సవాలు



ఆలయ ముఖ ద్వారంలో వెలసిన శనీశ్వరస్వామి

పావగడ: కర్ణాటక రాష్ట్రం పావగడ శనీశ్వరాలయంలో సోమవారం నుంచి శ్రావణ శని వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి, శీతలాంబదేవికి విశేష శ్రావణ మాస పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ నెల 10న జరిగే తొలి శ్రావణ శని వారోత్సవం, 17న నిర్వహించే ద్వితీయ శ్రావణ శనివారోత్సవం, 24, 31న జరిగే తృతీయ, చతుర్థ శ్రావణ శని వారోత్సవాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి. సాధారణంగా ద్వితీయ, చతుర్థ శ్రావణ శనివారోత్సవ పూజలకు భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. దావణగెరె, శివమొగ్గ, చిత్రదుర్గం, చళ్ళకెరె ప్రాంతాలకు చెందిన శనీశ్వర స్వామి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో స్వామికి పూజలు చేస్తారు. తల నీలాలు తప్పనిసరిగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. పాత దుస్తులు అక్కడే వదిలేసి కొత్త దుస్తులు ధరిస్తారు. శనీశ్వరుని పూజల అనంతరం సమీపంలో ఉన్న ఏక శిల కోటి ఆంజనేయస్వామికి పూజలు సమర్పిస్తారు. అలా పూజలు చేస్తే శనీశ్వరస్వామి... ఆంజనేయ స్వామికి భయపడి భక్తుల వెంట పడడనేది నమ్మకం. అలాగే శనీశ్వరస్వామిని మొక్కుకున్న భక్తులు వెన్నును స్వామి కి చూపకుండా ముఖాన్ని చూపిస్తూ బయటకు రావడం విశేషం. అదే విధంగా దేవాలయాలకు తలమానికంగా మారిన పావగడలో ప్రాచుర్యం పొందిన నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి, కణివె లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేస్తుంటారు.

కూటమి ప్రభుత్వ నిరాదరణతో బడి మూత

సోమందేపల్లి మండలం నాగినాయని చెరువు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఒకప్పుడు రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా పేరుండేది. ఇక్కడ చదువుకున్న వారు హైకోర్టు జడ్జి, ఐఏఎస్, ఐపీఎస్, ఉపాధ్యాయులు ఇలా ఉన్నత స్థానాలకు ఎదిగారు. అలాంటి గ్రామంలో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఏడాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు తక్కువ ఉన్నారన్న నెపంతో విద్యాశాఖ అధికారులు మూసేశారు. దీంతో తండాలో ఉన్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు.



మూతపడిన నాగినాయని చెరువు ప్రాథమిక పాఠశాల

విద్యా వ్యవస్థపై కక్ష

విద్యావ్యవస్థలో కనీవినీ ఎరు గని రీతిలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. భవిష్యత్తులో కూడా ఎవరూ చేయని విధంగా విద్యార్థుల కోసం పలు పథకాలు తీసుకొచ్చి.. ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచింది. అయితే ప్రస్తుత 'కూటమి ప్రభుత్వం' విద్యావ్యవస్థపై కక్షసాధింపు చర్యలు చేపట్టి భావి పౌరుల భవిష్యత్తును ఆందోళనకరంగా మారుస్తోంది. ప్రతి చిన్న విషయానికీ రాజకీయ రంగు పులిమి ఉద్యోగులను, ఉపాధ్యాయులను వేధిస్తోంది. ఫలితంగా చాలా చోట్ల విద్యావ్యవస్థ కుంటుపడింది.

- బదిలీపై వెళ్లకుండా టీచర్లపై వేధింపులు
- అయ్యవార్లు లేక విద్యార్థుల సతమతం
- ఇప్పటికీ అందని 'విద్యాకానుక' కిట్లు
- స్కూల్ కమిటీలన్నీ రద్దు చేసిన వైనం
- కొత్త కమిటీ ఎన్నికల్లో 'తమ్ముళ్ల' పెత్తనం
- మెనూ పాటించకుండా మధ్యాహ్న భోజనం
- గత ప్రభుత్వానికి భిన్నంగా కూటమి పాలన



విద్యార్థులు లేక మూతపడిన రొద్దం మండలం చిన్నకోడిపల్లి ప్రాథమిక పాఠశాల

సాక్షి, పుట్టపర్తి: విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ సక్రమంగా లేదు. దీంతో చాలామంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వదిలి ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. మధ్యాహ్న భోజనం అమలు తీరు బాగాలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. అన్నం ముద్దగా ఉంటోందని.. రసం మరీ నీళ్లగా ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. కోడిగుడ్డు ఇస్తారో? లేదో? తెలీదంటున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలో పని చేసే వారందరినీ తొలగించారు. కొత్తవారిని కొన్ని చోట్ల నియమించారు. మరికొన్ని చోట్ల రోజుకొకరు వచ్చి దినకూలీల తరహాలో అన్నం వండి వెళ్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను ఆ స్థానాలకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఉన్న చోటే పని చేయాలని కక్షసాధింపు చర్యలు చేపట్టారు. వ్యవస్థలన్నీ తమ చేతుల్లోనే ఉండాలని అధికార టీడీపీ నాయకులు కంకణం కట్టుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)లు రద్దు చేశారు. కొత్త కమిటీలు ఇంకా నియమించలేదు. దీంతో స్కూళ్ల నిర్వహణ గురించి పట్టించుకునే వారే లేరు.

ఆగిన టీచర్ల బదిలీలు

గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే.. ఆ ప్రక్రియ ముందుకు సాగకుండా కూటమి నాయకులు అడ్డుపడ్డారు. అత్యవసరం కింద సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులను బదిలీ చేసినా... వారు ఆ స్థానాలకు వెళ్లకుండా కూటమి నాయకులు అడ్డంకులు సృష్టించారు. ఫలితంగా ఉపాధ్యాయుల కొరత ఏర్పడి బోధనకు ఆటంకంగా మారింది.

- వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే ఉద్దేశంతో కొందరు ఉద్యోగులపై కూటమి నేతలు వేధింపు చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వంలో బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో 35 మందిని వెళ్లనీయకుండా అధికారుల ద్వారా అడ్డుకట్ట వేశారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. ఉన్న చోటనే పని చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఫలితంగా కొందరు మహిళా ఉపాధ్యాయులు కుటుంబ, అనారోగ్య సమస్యల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. గత జూన్‌లో చాలా చోట్ల పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారు. ఆయా స్థానాలకు సర్దుబాటు కార్యక్రమాలు కూడా చేపట్టలేదు. దీంతో అయ్యవార్లు లేక.. విద్యార్థులు సతమతం అవుతున్నారు.

మెనూ పర్యవేక్షణ ఏదీ..?

మధ్యాహ్న భోజన ఏజెన్సీల్లో సిబ్బంది మారిన క్రమంలో మెనూ పర్యవేక్షణను మరిచారు. దీంతో పని చేసే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా పాఠశాలల్లో కోడిగుడ్డు ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తున్నట్లు తెలిసింది. భోజనం కూడా నాణ్యత లోపించిందని విద్యార్థులు చెబుతున్నారు. అన్నం ముద్దగా ఉంటోందని.. రసం పలచగా ఉంటోందనే ఫిర్యాదులు ఉన్నాయి. అయితే దీనిపై ఫిర్యాదు చేస్తే.. టీసీ ఇచ్చి పంపుతామని ఉపాధ్యాయులు హెచ్చరించినట్లు కూడా సమాచారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాణ్యమైన భోజనంతో పాటు రోజూ మెనూ పాటించేవారని విద్యార్థులు చెబుతున్నారు.

మంత్రి ఇలాకాలో మరీ దారుణం

మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గంలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిపడా లేక రెండు, మూడు తరగతులను కలిపి ఒకే చోట నిర్వహిస్తున్నారు. దీంతో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు వెనుకడుగు వేస్తున్నారు. రొద్దం మండలం చిన్నకోడిపల్లిలో విద్యార్థులు ప్రైవేట్ బాట పట్టడంతో ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. మరో ఆరు (పెద్దమంతూరు, పెద్దగువ్వలపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, కలిపి, ఎస్.కొట్టాల, కందుకూర్లపల్లి) పాఠశాలల్లో పది మంది లోపే విద్యార్థులు ఉన్నారు. పెనుకొండ బాలికల ఉన్నత పాఠశాల, సెంట్రల్ హైస్కూల్‌లో మరుగుదొడ్ల నిర్వహణ బాగాలేదనే ఫిర్యాదులు ఉన్నాయి.

అందని 'విద్యా కానుక'

గతంలో బూట్లు, నోట్ బుక్‌లు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, బ్యాగుతో కలిపి జగనన్న విద్యాకానుక పేరుతో కిట్లను పాఠశాలల పునఃప్రారంభం రోజే అందించేవారు. అయితే ఈసారి కూడా కిట్లన్నీ ఆయా పాఠశాలలకు చేరాయి. కొన్ని చోట్ల అందరికీ ఇచ్చారు.. మరికొన్ని పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులకు అందలేదనే ఫిర్యాదులు ఉన్నాయి. రొద్దం మండలంలో విద్యాకానుక కిట్ల పంపిణీలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో వివరాలు ఇలా..

2,078	జిల్లాలోని పాఠశాలలు
8,307	ఉపాధ్యాయుల సంఖ్య
1,27,104	విద్యార్థుల సంఖ్య
1,438	మధ్యాహ్న భోజన ఏజెన్సీలు

పాలకుల తీరు మారాలి



విద్యావ్యవస్థపై పాలకుల తీరు మారాలి. భావిపౌరులు ఇబ్బందులు పడేలా చేస్తే.. ఉద్యమిస్తాం. విద్యార్థుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ బాగుండాలి. పెనుకొండలో సరిగా నిర్వహణ లేదని తెలిసింది. ఇప్పటికే మంత్రి సవిత తనిఖీ చేశారు. త్వరలోనే మరమ్మతులు చేపట్టి.. బాగు చేయిస్తారేమోనని ఆశిస్తున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కోడిగుడ్డు ఇవ్వలేదట!



మధ్యాహ్న భోజన పథకాన్ని పట్టించుకోవడం లేదు. వారంలో ఒక్క రోజు కూడా కోడిగుడ్డు ఇవ్వలేదని నా మనవళ్లు ఇద్దరూ చెబుతున్నారు. అంతేకాకుండా అన్నం ముద్దగా ఉంటోందని.. రసం పలుచగా ఉంటోందని చెప్పారు. ఇలాగే ఉంటే ఆ పాఠశాలకు పోయేది లేదని నా మనవళ్లు ఇద్దరూ ఇంటి వద్ద గొడవ చేస్తున్నారు. అధికారులు స్పందించి మెనూ అమలు చేయాలి.

– సాలెమ్మ, నల్లచెరువు మండలం

విద్యార్థులను ఇబ్బంది పెట్టరాదు



మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించడం లేదు. వంద మందిపైబడి విద్యార్థులు ఉన్న చోట కోడిగుడ్డు ఇవ్వడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొడికొండలో వంట చేసే గది నిర్మాణం పునాది స్థాయిలోనే ఉంది. రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో ఉన్నవారినే సర్దుబాటు చేస్తే బాగుంటుంది.

– ఎస్.రామకృష్ణారెడ్డి, చిలమత్తూరు

బదిలీలు అడ్డుకోవడం సరికాదు



ఉపాధ్యాయుల బదిలీలపై కూటమి నేతల పెత్తనం తగదు. చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. బదిలీ చేసిన వారిని వెంటనే ఆయా స్థానాలకు పంపించాలి. చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. ఉన్నత పాఠశాలల్లో ఇలాంటి సమస్య ఎక్కువగా ఉంది. అలాంటి స్థానాలకు ఉన్న టీచర్లను సర్దుబాటు చేస్తే బాగుంటుంది.

– రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

4 రైల్వే స్టేషన్లకు అమృత్ వర్షం

- కదిరి, పుట్టపర్తి, హిందూపురం, ధర్మవరం స్టేషన్లకు మహర్దశ
- నిరంతర ప్రాతిపదికన రైల్వే స్టేషన్ల అభివృద్ధి
- విమానాశ్రయాల తరహాలో ప్రయాణికులకు సౌకర్యాలు



కదిరి రైల్వేస్టేషన్



పుట్టపర్తి రైల్వే స్టేషన్

కదిరి: రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే స్టేషన్లను ఆధునికీకరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో 'అమృత్ భారత్ స్టేషన్' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేలా రైల్వే స్టేషన్ల రూపురేఖలు మార్చేందుకు ఉద్దేశించిన ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో తొలి విడత 11 రైల్వే స్టేషన్లను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నారు. తాజాగా మలి విడతలో మరో 75 స్టేషన్లను రైల్వే శాఖ ఎంపిక చేసింది. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం రైల్వే స్టేషన్లు ఎంపికైన జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం ప్లాట్‌ఫాంలు 600 మీటర్ల పొడవుతో ఉన్నాయి. వాటి పొడవు 760 మీటర్ల నుంచి 840 మీటర్ల వరకు పెరగనున్నాయి. దశలవారీగా ఈ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. విమానాశ్రయాల తరహాలో రైల్వే ప్రయాణికులకు ఎన్నో సౌకర్యాలు అందనున్నాయి.

ఉపయోగాలెన్నో...

విశాలమైన ప్లాట్‌ఫాంలు, 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఎయిర్ కండీషన్డ్ ఆడిటోరియంలు, ఫుడ్ కోర్టులు, అన్ని వసతులతో వెయిటింగ్ హాల్, అధునాతన వసతులతో టాయిలెట్స్, ఉచిత వైఫై సౌకర్యం, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, విశాలమైన పార్కింగ్, మరిన్ని భవనాల నిర్మాణం, ఫర్నీచర్, పిల్లల ఆట స్థలాలు, బేబీ కేర్ గదులు, ప్రయాణికుల సమాచార వ్యవస్థలను మెరుగుపరచడం, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, స్పర్శ మ్యాప్‌లు వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. విమానాశ్రయాల్లో లాగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేయనున్నారు. అవసరాలకు అనుగుణంగా ల్యాండ్ స్కేపింగ్‌కు కూడా ప్రాధాన్యత నిస్తూ దశలవారీగా అభివృద్ధి చేస్తారు. స్థానిక ఉత్పత్తుల అమ్మకానికి ప్రత్యేకంగా రెండు స్టాల్స్, ప్రతి స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా ఏర్పాటు చేస్తారు. ఇంకా ఎన్నో సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రజల సూచనలు, సలహాలు

'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో రైల్వేశాఖ ప్రజల్ని కూడా భాగస్వాముల్ని చేసింది. ఆయా రైల్వేస్టేషన్లలో ఇంకా ఎలాంటి సౌకర్యాలు కావాలో ప్రజల నుంచి సూచనలు, సలహాలు కోరింది. ఈ–మెయిల్, ట్విట్టర్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 185 మంది తమ సూచలను, సలహాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్



'అమృత భారత్ స్టేషన్' పథకం కింద దేశ వ్యాప్తంగా 1,275 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందుకోసం రూ.24,470 కోట్లు కేటాయించారు. జిల్లాలో కదిరి, హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి స్టేషన్లను ఎంపిక చేశారు. ఈ పథకం కింద స్టేషన్‌లో 53 రకాల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ప్రతి స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. కదిరి రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే ఈ పనులు మొదలయ్యాయి.

– శివప్రకాష్ కుమార్, స్టేషన్‌మాస్టర్, కదిరి

రైల్వేకి మరింత ఆదాయం



రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు పెరిగితే రైలులో ప్రయాణించే వారి సంఖ్య కూడా బాగా పెరుగుతుంది. ఫలితంగా రైల్వేశాఖకు మరింత ఆదాయం వస్తుంది. అమృత్ భారత్ పథకం ద్వారా జిల్లాలో నాలుగు రైల్వే స్టేషన్లను ఎంపిక చేయడం సంతోషదాయకం. జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు మరిన్ని రైళ్లు ఏర్పాటు చేయల్సిన అవసరం ఉంది.

– సుబ్బరాయుడు, ఏడీసీసీ బ్యాంకు రిటైర్డ్ డీజీఎం

శ్రావణం.. నెట్టికంటుడి వైభవం

- కసాపురంలో నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు ఘనంగా సాగనున్నాయి. అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు చేపట్టారు.

విశేషాలంకరణలో భక్తులకు కటాక్షం..

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న మొదటి శనివారం స్వామివారిని వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం సీతారామచంద్ర లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేషవాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఈనెల 17న రెండో శనివారం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను హనుమంతవాహనంపై, 24వ తేదీ మూడవ శనివారం గజ వాహనంపై, 31వ తేదీ నాల్గో శనివారం గరుడ వాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఐదు మంగళవారాల్లోనూ సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను వెండిరథంలో కొలువు దీర్చి ప్రాకారోత్సవం చేపడతారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు..

భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉచిత దర్శనం, ముఖమండప దర్శనం, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం కల్యాణ మండపాలతోపాటు, అన్నదాన కేంద్రం పక్కనున్న రేకుల షెడ్డు, గంగా నిలయం, పీఏసీలో ఉన్న డార్మెటరీ హాళ్లలో ఉచిత వసతి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నీటి కొళాయిలు, స్వామి దర్శనానంతరం ఉచిత ప్రసాద వితరణ కేంద్రం ఏర్పాటు చేశారు. తూర్పు రాజ గోపురం ముందు భాగంలో ఉన్న బెల్దోణ సత్రంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అన్నదానం చేయనున్నారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలతోపాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.





కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి

క్లుప్తంగా

ఏపీ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ సెక్రటరీగా జోసెఫ్



సమావేశానికి హాజరైన వివిధ జిల్లాలకు చెందిన ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ కార్యదర్శులు

పుట్టపర్తి: ఏపీ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ సెక్రటరీగా జిల్లాకు చెందిన కేజే జోసెఫ్‌కు చోటు దక్కింది. ఆదివారం పుట్టపర్తిలోని సాయిమా కన్వెన్షన్ హాల్‌లో ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ సెక్రటరీ రవీంద్ర చౌథ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర సెక్రటరీగా జోసెఫ్‌ను 26 జిల్లాలకు చెందిన సెక్రటరీలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫ్లోర్ బాల్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఉభయ జిల్లాల ఎస్జీఎఫ్ సెక్రటరీలు సుగుణమ్మ, పూల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

ధర్మవరం రూరల్: స్థానిక తారక రామాపురానికి కృష్ణమూర్తి, రాజేశ్వరి దంపతుల కుమారుడు మాదాపురం మహేష్ (24) ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... ఏడేళ్ల క్రితం తండ్రి మృతి చెందడంతో తల్లి రాజేశ్వరి కూలి పనులతో జీవనం సాగిస్తూ మహేష్‌ను పెంచి పెద్ద చేసింది. ఈ క్రమంలో తోడునీడగా ఉంటాడనుకున్న కుమారుడు మద్యానికి బానిసై, జులాయిగా మారాడు. మద్యం కొనుగోలుకు డబ్బు లేకపోవడంతో క్షణికావేశానికి లోనైన మహేష్... శనివారం రాత్రి గుట్టకిందపల్లి సమీపంలో పట్టాలపైకి చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

డీపీఓలో నేడు 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక'

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ వి.రత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా అర్జీల రూపంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఆకట్టుకున్న 'ప్రేమ బాటలో మణి దీపాలు'



సత్యసాయి పల్లకీ ఉత్సవాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకుంటున్న బాలికలు



నాటికలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి చేరుకున్న తూర్పుగోదావరి జిల్లా భక్తులు ఆదివారం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సత్యసాయి స్ఫూర్తిని, సత్యసాయి బాలవికాస్ విశిష్టతను కీర్తిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. ఉదయం సాయికుల్వంత్ సభామందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి సహస్ర నామార్చన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది ఏక కాలంలో సహస్ర నామాలను పఠించారు. సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'ప్రేమ బాటలో మణి దీపాలు' నృత్యరూపకం ఆద్యంతం ఆలోచనాత్మకంగా సాగింది.

రైతులపై టీడీపీ నేత దాష్టీకం

- తరాలుగా వాడుకలో ఉన్న రహదారి మూసివేత
- రైతులు వేడుకున్నా కనికరించని టీడీపీ నేత అనుచరులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు



పొలంలోకి వెళ్లే దారిని తవ్వి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ధర్మవరం: రైతులు పొలాలకు వెళ్లే రహదారిని తన అనుచరులతో మూత వేయించి టీడీపీ నేత సందా రాఘవ దౌర్జన్యానికి తెగబడ్డారు. వివరాలు... ధర్మవరం మండలం గొల్లపల్లి గ్రామంలో సర్వే నంబర్ 296–2లో లింగమయ్య, నాగభూషణ, ఆదినారాయణకు 3.98 ఎకరాల పొలం ఉంది. వీరికి ముందు భాగాన టీడీపీ నేత సందా రాఘవ అనుచరుడు పడమల శేషయ్యకు 2 ఎకరాల పొలం ఉంది. అయితే తాతల కాలం నుంచి వీరి పొలాలకు మధ్యన రహదారి ఉంది. ఈ రహదారి గుండానే రైతులు రాకపోకలు సాగించేవారు. అయితే 2022లోనే రహదారిని మూసివేసేందుకు పడమల శేషయ్య యత్నించాడు. అప్పుడు బాధిత రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో మండల సర్వేయర్‌తో సర్వే చేయించి రికార్డుల్లో రహదారిగా నమోదై ఉండడంతో వెంటనే పునరుద్ధరించి శేషయ్య ఆలోచనకు అడ్డుకట్ట వేశారు. దీనిపై శేషయ్య కోర్టును ఆశ్రయించాడు.

ప్రభుత్వం మాది అంటూ...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి మూసివేసేందుకు టీడీపీ నాయకులు ప్లాన్ వేశారు. అనుకున్నదే తడవుగా శనివారం సాయంత్రం సందా రాఘవ అనుచరులు పొలం వద్దకు జేసీబీలతో చేరుకుని రహదారిని ఛిద్రం చేశారు. రహదారి మధ్యలో గుంతలు తవ్వి అడ్డుగా మట్టి వేశారు. ఈ స్థలం కోర్టు పరిధిలో ఉందంటూ హెచ్చరిక బోర్డునూ ఏర్పాటు చేశారు. రోడ్డును ధ్వంసం చేయరాదంటూ బాధిత రైతులు ప్రాధేయపడినా వినలేదు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం రాజ్యమేలుతోందని, తమను అడ్డుకునే వారు ఎవరూ లేరంటూ దౌర్జన్యం చేశారు. ఎవరైనా ఎదురు తిరిగితే ఎంతకైనా తెగిస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఈ సందర్భంగా బాధిత రైతులు వాపోయారు. అంతేకాక రీసర్వే చేయించుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని తమ పంట పొలాలకు దారి ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు.

తైక్వాండో ఓవరాల్ చాంపియన్ 'విజయనగరం'



చాంపియన్ ట్రోఫీతో విజయనగరం క్రీడాకారులు

తాడిపత్రి అర్బన్: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా తాడిపత్రిలో సాగుతున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారు. పోటీల్లో 13 జిల్లాలకు చెందిన సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం జరిగిన పోటీల్లో విజయనగరం జిల్లా చాంపియన్ షిప్‌ను దక్కించుకోగా, రెండో స్థానంలో అనంతపురం జిల్లా, మూడో స్థానంలో తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు సాయి తెలిపారు.

విద్యుత్ తీగలు తెగి పడి ఇద్దరికి గాయాలు





గాయపడిన తులసమ్మ, లక్ష్మీనారాయణమ్మ

ముదిగుబ్బ: స్థానిక దొరిగిల్లు రోడ్డులో ఆదివారం ఉదయం 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో చిరు వ్యాపారులు తులసమ్మ, లక్ష్మీనారాయణమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ తీగలపై కోతులు ఎగరడంతో అవి ఒకదానికి ఒకటి తగులుకుని మంటలు ఎగిసి తెగి కింద పడ్డాయి. అయితే ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తమిళనాడు, కేరళ జట్ల విజయం

అనంతపురం: ఆర్డీటీ క్రీడాగ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ముఖ్య అతిథిగా సీఐ విశ్వనాథచౌదరి, ఫుట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంయుక్త కార్యదర్శి ఈరన్న గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఉదయం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు, గుజరాత్ జట్లు తలపడ్డాయి. 4–0 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టు విజయం సాధించింది. అలాగే మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో 3–0 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌పై కేరళ జట్టు విజయం సాధించింది.

తైక్వాండో ఓవరాల్ చాంపియన్ 'విజయనగరం'

తాడిపత్రి అర్బన్: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా తాడిపత్రిలో సాగుతున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారు. పోటీల్లో 13 జిల్లాలకు చెందిన సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం జరిగిన పోటీల్లో విజయనగరం జిల్లా చాంపియన్ షిప్‌ను దక్కించుకోగా, రెండో స్థానంలో అనంతపురం జిల్లా, మూడో స్థానంలో తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు సాయి తెలిపారు.

ఖరీఫ్ పంటల్లో సస్యరక్షణ అవసరం



వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: ఓ వైపు వర్షాభావం, మరో వైపు భిన్నమైన వాతావరణ పరిస్థితుల మధ్య ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. గత 25 రోజులుగా వర్షాలు లేనందున సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి తదితర పంటలు బెట్టకు గురైనట్లు తెలిపారు. బెట్టను అధిగమించేందుకు వేరుశనగ, కంది, ఆముదం పంటల్లో ప్రస్తుతం లీటర్ నీటికి 10 గ్రాముల 19–19–19 కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. నీటివసతి ఉన్న ప్రాంతాల్లో పూత దశకు చేరుకున్న వేరుశనగకు ఒక రక్షకతడి ఇస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. వర్షం వస్తే తేమశాతం, నీటి సంరక్షణను బాగా పెంచుకునేందుకు వీలుగా వేరుశనగ పంటలో ప్రతి 3.6 మీటర్లకు ఒక తల్లిచాలు (గొడ్డుచాలు) ఏర్పాటు చేయాలన్నారు. విత్తే సమయంలో లేదా విత్తిన నెల రోజుల్లోపు గొడ్డుచాలు కోసం దున్నినా ఇబ్బంది ఉండదన్నారు. కందిలో మొక్కల మధ్య 20 సెంటీమీటర్లు, ఆముదంలో మొక్కల మధ్య 60 సెంటీమీటర్ల దూరం ఉండేలా చేస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. అలాగే అంతర సేద్యం ద్వారా కలుపు లేకుండా చూసుకోవాలన్నారు. ఇక ప్రధాన పంటల సాగుకు అదను ముగిసినందున ఈ నెలలో వర్షాలు కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఎర్ర నేలల్లో స్వల్పకాలిక రకమైన కంది, జొన్న, కొర్ర (సూర్య, మహానంది రకం), సజ్జ, అలసంద, పెసర (ఐపీఎం–2–14, డబ్ల్యూజీజీ–42 రకం), ఉలవ, ఆముదం, పెసర, అనుము పంటలు వేసుకోవాలన్నారు. నల్లనేలల్లో కంది, ఆముదం, పత్తి వేసుకోవచ్చని తెలిపారు.

రూ.వెయ్యి కోట్ల బీమా విడుదల చేయండి

- సీపీఎం అనంత జిల్లా కార్యదర్శి రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: 'గత ఏడాది నుంచి వర్షాభావం వెంటాడడంతో జిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రకటించిన రూ.వెయ్యి కోట్ల బీమా పరిహారాన్ని తక్షణం విడుదల చేసి, జిల్లా రైతులను ఆదుకోవాలి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఓ.నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాంభూపాల్ మాట్లాడుతూ.. గత ఏడాది ఖరీఫ్‌లో 28 మండలాలు, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా జిల్లా మొత్తం కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు అదనపు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు విడుదల చేసి కూలీలను ఆదుకోవాలన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం అమూల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం ఉండడంతో తక్షణమే ప్రభుత్వ డెయిరీని పునరుద్ధరించి పాల కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేరళ బాధితులను ఆదుకుందాం..

కేరళలోని వాయినాడు బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా విరాళాలు అందజేయాలని జిల్లా ప్రజలకు రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఈ నెల 5, 6 తేదీల్లో విరాళాలు సేకరించేలా కార్యాచరణను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, సావిత్రి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, ఆర్వీనాయుడు, నిర్మల, నాగమణి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో విద్యార్థుల ఘర్షణ

అనంతపురం: జేఎన్‌టీయూలో శనివారం రాత్రి విద్యార్థులు ఘర్షణ పడ్డారు. గొడవలో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. వివరాలు.. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను నాలుగో సంవత్సరం విద్యార్థులు తమ హాస్టల్ వద్దకు రమ్మన్నారు. ఒక గదిలోని వారు తప్ప మిగిలిన వారంతా సీనియర్ల దగ్గరకు వెళ్లారు. ఈ క్రమంలో తాము పిలిచినా ఎందుకు రాలేదని గొడవ పడ్డారు. మాటామాట పెరిగి భౌతికదాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై రెండో సంవత్సరం చదువుతున్న ఓ కానిస్టేబుల్ కుమారుడు తన తండ్రికి సమాచారం ఇచ్చారు. ఆయన డయల్ -100కు ఫోన్ చేయడంతో ముగ్గురు కానిస్టేబుళ్లు వచ్చారు. అయితే, అనుమతి లేకుండా క్యాంపస్‌లోకి ఎలా వస్తారని కానిస్టేబుళ్లను కళాశాల అధికారులు నిలదీశారు. డయల్- 100 కు సమాచారమిస్తే వచ్చామని, విద్యార్థులు గొడవ పడకుండా చూడకుండా ఉండలేరా అని కానిస్టేబుళ్లు అధికారులకు సమాధానం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కళాశాల ఉన్నతాధికారులు విచారణ కమిటీని నియమించారు. కమిటీ సోమవారం సమావేశమై తదుపరి చర్యలు తీసుకోనుంది.

యాపిల్ ఫ్యాక్టరీ మేనేజర్‌పై హత్యాయత్నం

- తారస్థాయికి చేరుకున్న వర్కర్ల మధ్య విభేదాలు
- పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగులోకి

రాయదుర్గం (డి.హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలంలోని యాపిల్ ఐరన్‌ఓర్ ఫ్యాక్టరీలో వర్కర్ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పని విషయంలో తలెత్తిన గొడవ చివరకు ఆ ఫ్యాక్టరీ ప్రాసెస్ మేనేజర్‌పై హత్యాయత్నానికి దారి తీసింది. పోలీసులు తెలిపిన మేరకు... యాపిల్ ఫ్యాక్టరీలో ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా గొడిశెలపల్లి నివాసి మంగలి హనుమంతరెడ్డి, ప్రాసెస్ మేనేజర్‌గా బళ్లారికి చెందిన సతీష్ విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలంగా పని విషయంలో ఇద్దరి మధ్య వివాదం చెలరేగుతోంది. దీంతో సతీష్‌ను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని హనుమంతరెడ్డి పథకం వేశాడు. ఈ క్రమంలోనే శనివారం విధులు ముగించుకుని సాయంత్రం బళ్లారికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సతీష్‌ను ఓబుళాపురం ఫ్లైఓవర్ వద్ద హనుమంతరెడ్డి అడ్డుకున్నాడు. తనకే అడ్డు చెబుతావా? అంటూ సహోద్యోగులైన జేసీబీ ఆపరేటర్ సోములాపురం గ్రామానికి చెందిన గిరీష్, డి.హీరేహాళ్ గంగిరెడ్డి, బళ్లారికి చెందిన రషీద్, మరో నలుగురితో కలసి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న సతీష్‌ను చూసి మృతి చెందాడని అనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అటుగా వెళుతున్న వారు గమనించి సతీష్‌ను బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై ఆదివారం ఉదయం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. కాగా, మంగలి హనుమంతరెడ్డి టీడీపీ సానుభూతిపరుడు కావడంతో ఆ పార్టీ నేత చూసుకుని చెలరేగిపోతున్నాడని పలువురు ఆరోపించారు.

బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం: తన పేరు చెప్పి ఎవరైనా బెదిరింపులు, దందాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హెచ్చరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి పేరు చెప్పి దందాలు సాగిస్తున్న వైనంపై 'భలే మంచి చౌక బేరం' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే... ఓ ప్రకటన విడుదల చేశారు. తన పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారాన్ని నేరుగా తనకు అందజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటానని అన్నారు.

'తుంగభద్ర' పలకరింపు.. జనం పులకింత


తుంగభద్ర జలాల సవ్వడితో పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) పరిసరాలు ఆకట్టుకుంటున్నాయి. పెన్నహోబిలం ఆలయ సమీపంలో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది. పరవళ్లు తొక్కుతున్న జలాలను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంటోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం/ఉరవకొండ:



పీఏబీఆర్‌లోకి చేరుకుంటున్న నీరు



పీఏబీఆర్‌లో చేపలు పట్టేందుకు వల వేస్తున్న దృశ్యం



పెన్నహోబిలం ఆలయం వద్ద కనువిందు చేస్తున్న తుంగభద్ర జలాలు



వలలో పడిన చేపలను ఒడ్డుకు చేరుస్తున్న జాలరి